


భూపాలపల్లి ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి సత్యవతి, దయాకర్, బండా ప్రకాశ్, సిరికొండ, సారయ్య. జ్యోతి, శ్రీహర్షిణి, వెంకట్రావ్, రాజిరెడ్డి



ములుగు సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభివాదం చేస్తున్న అభ్యర్థి బడే నాగజ్యోతి, వేదికపై మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీలు పోచంపల్లి, సిరికొండ, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి, ఎంపీ కవిత

# అన్ని ప్రాంతాలు నాకు సమానమే..

**బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే అభివృద్ధి బాధ్యత నాదే.. అధికార పార్టీ ఎమ్మెల్యే ఉంటే అంతా మంచే జరుగుతది**

**నాగజ్యోతి ఎమ్మెల్యే అయితే ములుగు జ్యోతిలా వెలుగుతుంది.. గండ్రను గెలిపిస్తే మరింత ప్రగతి**

## ములుగు నాదే..

'తెలంగాణలో అన్ని ప్రాంతాలు నాకు సమానమే, ఇచ్చిన మాట ప్రకారం ములుగును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసినందుకు ఈ జిల్లాపై నాకు మరింత ప్రేమ ఉంది, ములుగు నాదే, నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు మూడోసారి ముఖ్యమంత్రిని అయ్యాక ఇక్కడికి వచ్చి ములుగులో రెండు రోజులు ఉండి అన్ని సమస్యలను పరిష్కరిస్తా.. ఎవరి చేతిలో ములుగు నియోజకవర్గం ఉంటే బాగా అభివృద్ధి చెందుతుందో ప్రజలు ఆలోచించాలి. సమక్క-సారలమ్మలు ఉన్న ఈ నేలకు వందనం చేస్తున్నా, ఎన్నో సార్లు సమ్మక్క తల్లి, సారక్క తల్లికి తెలంగాణ రావాలని మొక్కుకొని బంగారం అప్పజెప్పిన. రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే జాతరలో మెరుగైన సౌకర్యాలు కల్పించాం. జాతరను మరింత అభివృద్ధి చేసే ప్రయత్నం చేసుకుందాం..


ములుగులో ఉత్సాహంగా చప్పట్లు కొడుతున్న ప్రజలు

ములుగు/జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలు అనగానే ఆగం కావద్దని, అభ్యర్థి గుణగణాలు, అభ్యర్థి వెనుక ఉన్న పార్టీ చరిత్రను పరిశీలించి ఓటు వేయాలని ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే నియోజకవర్గాల బాధ్యత తానే తీసుకుంటానని చెప్పారు. ములుగులో నాగజ్యోతిని, భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు బడే నాగజ్యోతి, గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ములుగు, భూపాలపల్లిలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం ప్రసంగించారు.

- అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా సీతక్క నన్ను ఏనాడూ కలువలేదు
- భూపాలపల్లికి ఇంజినీరింగ్ కాలేజీ ఇస్తా.. సింగరేణిని ముంచింది కాంగ్రెస్సే
- ములుగు, భూపాలపల్లి ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్


భూపాలపల్లిలో కేరింతలు కొడుతూ..

### నాగజ్యోతి కష్టాల్లో పెరిగింది

నాగజ్యోతి ప్రజలే నా తల్లిదండ్రులని చెబుతోంది. చినప్పటి నుంచి కష్టాల్లో పెరిగింది. కష్టపడి ఉన్నత విద్యావంతురాలైంది. సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ అధ్యక్షురాలి దాకా ఎదిగింది. నాగజ్యోతి ఎమ్మెల్యే అయితే ములుగు కూడా ఒక జ్యోతిలా వెలుగుతుంది. కాంగ్రెస్ పార్టీవాళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నరు. నాటి ఇందిరమ్మ రాజ్యంలోనే నాగజ్యోతి తండ్రి బడే నాగేశ్వర్‌రావు ప్రజల కోసం పోరాటం చేసి అమరుడైండు. ఇందిరమ్మ రాజ్యం అంటే బానిస బతుకులు, ఎన్‌కౌంటర్లు, ఎదురుకాల్పులు. ప్రజలు నాగజ్యోతిని గెలిపిస్తే ఇక్కడ అన్ని సమస్యలు వంద శాతం పరిష్కరించే బాధ్యత నాది. కాంగ్రెస్ వాళ్లు వచ్చేది లేదు, సచ్చేది లేదు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలుపియకున్నా మీ మీద అలుగలేదు. ఇప్పుడు మాత్రం మీతోని పంచాయతీ పెట్టుకొని మరీ ఓట్లు అడుగుతాన్న. ములుగు అభివృద్ధి కావాలంటే గవర్నమెంట్ ఉన్న అభ్యర్థి గెలిస్తేనే అవుతది. నాగజ్యోతిని నిండు మనస్సుతో దీవించాలి.

### గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు

ములుగు నియోజకవర్గంలో పోడు భూముల సమస్యలను పరిష్కరించాం. వాటిపై కేసులను ఎత్తేసి రైతు బంధు, రైతుబీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటాం. కొంత మంది గిరిజనులు కాని వారికి సైతం పోడు భూములు ఉన్నాయి. అది కేంద్రం చేతిలో ఉంది. అయినా మీకు హామీ ఇస్తున్నా గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇస్తా. పోయిన ఎన్నికల్లో ఇదే ములుగుకు వచ్చిన సమయంలో ములుగు జిల్లా కావాలని ప్రజలు కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రజలు ఓడగొట్టినా ఇచ్చిన మాట నేను నిలబెట్టుకోవాలె కదా.. ఎందుకంటే ములుగు నాది కదా.. తెలంగాణలో ఏమూలైనా , ఏ పల్లె అయినా అభివృద్ధి చెందింది అంటే కేసీఆర్‌కు గౌరవమే కదా.. నవ్వేటోళ్ల ముందు తెలంగాణ జారి పడద్దని ఇక్కడ ఇచ్చిన మాట ప్రకారం జిల్లా చేసిన. జీవితంలో ఎవరైనా అనుకున్నారా ములుగుకు మెడికల్ కాలేజీ వస్తదని!. మెడికల్ కాలేజ్‌తో 400 పడకల దవాఖాన, నర్సింగ్ కా లేజీ, పారామెడికల్ కోర్సులతో పాటు బ్రహ్మాండమైన వైద్య సేవలు ప్రజలకు అందుతాయి. పోయిన సారి వరదలు వచ్చినప్పుడు రామన్నగూడెంలో పర్యటించిన, అపుడు ప్రజలు డయాలసిస్ సెంటర్ కావాలని కోరిన వెంటనే ఏర్పా టు చేసిన. కొన్ని సమస్యలున్నయని బడే నాగజ్యోతితో పాటు కొందరు నాయకులు నాకు చెప్పారు. ఎమ్మెల్యే ఏ పార్టీలోనైనా ఉండవచ్చు కానీ తప్పక ముఖ్యమంత్రిని కలవాల్సి ఉంటుం ది. ములుగు ఎమ్మెల్యే ఎన్నడూ రాలేదు, ఏం అడుగలేదు. మనకు తోచినవి, మన పార్టీ వాళ్లు చెప్పిన పనులు చేసినం తప్ప ఆమె ఏనాడూ ఇది కావాలని అడుగలే. ములుగు ముఖ్యంగా గిరిజన ప్రాంతం, ఇక్కడ ఎక్కువ సమస్యలు ఉంటయి. వాటిని పరిష్కరిస్తా..


ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్
భూపాలపల్లి సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు


భూపాలపల్లిలో 'కేసీఆర్ నంబర్ వన్' ఐకాన్‌తో బీఆర్ఎస్ అభిమాని

*చీమలపుట్టల్లోంచి బారులు తీరినట్టు.. నలుదిక్కుల నుంచి దండులా కదిలివచ్చిన లక్షలాది మందితో భూపాలపల్లి, ములుగు ప్రాంతాలు పోటెత్తాయి. తమ అభిమాన నేత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కనులారా చూసి, ఆయన మాటలు విని జోరువానను సైతం లెక్కచేయకుండా అశేషంగా తరలివచ్చిన జనాలతో రెండు నియోజకవర్గ కేంద్రాలు పులకించిపోగా, అభ్యర్థులు గండ్ర వెంకటరమణారెడ్డి, బడే నాగజ్యోతి ఉప్పొంగిపోయారు. ఓ వైపు కళాకారుల ఆటాపాటలు, జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలతో ఆద్యంతం ఉద్రూతలూగిన సభికులతో ములుగు, భూపాలపల్లి ప్రజా ఆశీర్వాద సభలు కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం అయ్యాయి. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీతో ప్రజల్లో ఆనందం విల్లివిరియగా, గెలుపు ఖాయం అనే ధీమాతో బీఆర్ఎస్ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఊగిపోయాయి.*

*- జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 24(నమస్తే తెలంగాణ)/కృష్ణకాలనీ/ములుగు రూరల్/ములుగు టౌన్*

# జోరు వానలోనూ జన హోరు..

- కేసీఆర్ రాకతో మురిసిన ములుగు.. భూపాలపల్లి
- రెండు సభలకు చీమలదండులా కదిలొచ్చిన లక్షలాది మంది
- అభిమాన నేత కేసీఆర్ కోసం వర్షాన్ని లెక్కచేయని వైనం
- ప్రజా ఆశీర్వాద సభలు సూపర్ సక్సెస్


భూపాలపల్లి సభలో జైకొడుతున్న కళాకారులు


భూపాలపల్లిలో వర్షంలోనూ సీఎం కేసీఆర్ ప్రసంగం వింటున్న ప్రజలు

### భూపాలపల్లి అభివృద్ధి బాధ్యత నాదే

భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు బాధ్యత మీదే.. ఇప్పటికే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. ఇకపై మరింత అభివృద్ధి చేసే బాధ్యత నాదే.. పొద్దటి నుంచి భూపాలపల్లిలో జోరు వర్షం కురుస్తున్నా ఇంత పెద్ద ఎత్తున జనం సభకు హాజరై ఇంతసేపు నా కోసం ఎదురుచూశారంటే గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు ఖాయమైందని అర్థమవుతోంది. సింగరేణి సంస్థ వంద శాతం మనకే ఉండేది. కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ నాయకులు సింగరేణిని నిండా ముంచిన్రు. సింగరేణిని కాపాడడం చేతకాక కేంద్రం దగ్గర అప్పులు తెచ్చి, అవి తీర్చడం చేతకాక 49శాతం వాటాను కేంద్రానికి అప్పగించిన్రు. లేకుంటే సింగరేణి మన రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేది. సంస్థలో అనాదిగా ఉన్న డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌ను సైతం పోగొట్టి కార్మికులను ఆగం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే సింగరేణిని కాపాడే బాధ్యతను మా భుజాలపై వేసుకున్నాం. మా యూనియన్ నేతలు వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డి నా దగ్గరకు వచ్చి సింగరేణిలో డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌ను కొనసాగించాలని, కార్మికులకు మేలు చేయాలని అడిగారు. వాటిని కారుణ్య నియామకాల పేరుతో తిరిగి తీసుకువచ్చి 15వేల మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగాలిచ్చాం. మీ ఎమ్మెల్యే కోరినట్లు భూపాలపల్లికి ఇంజినీరింగ్ కళాశాల ఇస్తాం. కొత్తగా ఏర్పడ్డ గోరికొత్తపల్లి మండల అభివృద్ధి బాధ్యత నాదే. గతంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న భూపాలపల్లిని మధుసూదనాచారి చాలా అభివృద్ధి చేశారు. అనంతరం గండ్ర అభివృద్ధిని పరుగులు పెట్టించారు. గండ్రను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చెందుతది. ఇచ్చిన మాట ప్రకారం భూపాలపల్లిని జిల్లాగా చేసి ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టినం. ఎన్నికలంటే ఎవరో ఒకరు పోటీ చేస్తరు.. ఎవరో ఒకరు గెలుస్తరు.. ఎవరు గెలిస్తే అభివృద్ధి అవుతుందనే విషయాన్ని ఆలోచించుకోవాలె. ఆదమరిచి ఓటు వేస్తే అభివృద్ధి ఆగిపోతుంది. గండ్ర వెంకటరమణారెడ్డి గెలవాలి, లేకుంటే కిందమీదైతది.'

### అంచనాకు మించి..

బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో ములుగులోని తంగేడు మైదానంలో, భూపాలపల్లి అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కేటీకే-5 ఇంక్లైన్ ఆవరణలో తలపెట్టిన ప్రజా ఆశీర్వాద సభలు జనసంద్రాన్ని తలపించాయి. రెండు చోట్లా అంచనాకు మించి ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతాలన్నీ జాతరను తలపించాయి. ఐదు సంవత్సరాలుగా అధికార పార్టీ ఎమ్మెల్యే లేకపోవడంతో ప్రజలు కోల్పోయిన మంచి, సీఎం కేసీఆర్ చేసిన ప్రగతి శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కళ్లకు కట్టినట్లు కనిపించింది. సభకు లక్ష మంది వస్తారని అంచనా వేయగా అధినేతను చూసేందుకు అంతకుమించి రావడంతో ఎటుచూసినా జనప్రవాహమే కనిపించింది. కిలోమీటర్ల దాకా ఫ్లెక్సీలు, భారీ కటౌట్లతో ములుగు, భూపాలపల్లి పట్టణాలు గులాబీమయమ్యాయి. నలుమూలలోని భారీగా వచ్చిన జనంతో అంబేద్కర్ సెంటర్ కిక్కిరిసిపోయింది. డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ భారీ ర్యాలీగా సభకు చేరుకున్నారు. భూపాలపల్లిలో మిట్టపల్లి సురేందర్, ములుగులో సింగర్ మధుప్రియ, కవి, గాయకుడు మానుకోట ప్రసాద్‌లు తమ ఆటాపాటలతో ప్రజలను ఉర్రూతలూగించగా మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, అభ్యర్థి బడే నాగజ్యోతి, మహిళా ప్రజాప్రతినిధులు, కళాకారులతో కలిసి నృత్యం చేసి ఉత్సాహం నింపారు. మిట్టపల్లి పాడిన 'అటు పొద్దు ఇటు పొడిచినా', కళాకారిణి రామక్క పాటకు ప్రజలు ఉత్సాహంగా స్టెప్పులేశారు. సీఎం రాక కోసం ప్రజలు ఎదురు చూస్తున్న క్రమంలో మధ్య మధ్యలో వర్షం కురుస్తున్న ప్రజలు అడుగు పక్కకు వేయకుండా తమ వెంట తెచ్చుకున్న గొడుగులను, సీఎం కేసీఆర్ ప్లేకార్డులను తలలపై పెట్టుకొని ఆకాశ మార్గాన వచ్చే సీఎం కేసీఆర్ కోసం ఎదురుచూశారు. 3:43గంటలకు హెలిక్యాప్టర్ లాండ్ కాగానే జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలతో అపూర్వ స్వాగతం పలికారు. భూపాలపల్లిలోనూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3గంటల వరకు వర్షం కురుస్తూనే ఉండగా, సభ నిర్వహణ సాధ్యమేలా పార్టీ శ్రేణుల్లో సందేహం వ్యక్తమైంది. కానీ అభిమానం ముందు అన్నీబలాదూర్ అన్నట్టు సభకు లక్షకు పైగా వచ్చి చేరుకున్నారు. కుర్చీలు సరిపోక చాలా మంది నిలబడే సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. మధ్యలో వర్షం మొదలవడంతో కేసీఆర్ తన ప్రసంగాన్ని త్వరగా ముగించారు. కేసీఆర్ తన ప్రసంగంలో ములుగు సంఘటన ప్రేరణతోనే కల్యాణలక్ష్మి పురుడు పోసుకుందని గుర్తు చేసి ప్రజలతో పంచుకున్నారు. కేసీఆర్ ప్రసంగం ముగిసేంత వరకు ప్రజలు తమ చూపును పక్కకు తిప్పకుండా శ్రద్ధగా వింటూ సందర్భానుసారం ఈలలు, కేరింతలు కొట్టారు.